ఎత్తుకు పై యెత్తు

వసుంధర

రాష్ట్రంలోని ప్రతిపక్షాలన్నీ ఒకటై—ప్రభుత్వ విధానాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి సమీక్షించాలని మనోహర రెడ్డి పత్రికాముఖంగా విజ్ఞప్తి చేశాడు.

ఆయన తలపండిన జాతీయవాది. రాజకీయపక్షాలకు అతీతుడు. రాష్ట్రమంతటా ఆయనంటే ప్రత్యేక గౌరవ భావముంది. ఆయనను రాజకీయాల్లోకి దింపాలని ఎందరో ప్రయత్నించారు. అటు నెహ్రూ కుటుంబం—ఇటూ సినీ గ్లామరు.... ఈ రెంటినుంచీ రాష్ట్రాన్ని తప్పించి ప్రజలను ప్రజలకోసం పాలించగల మహా నిజాయితీపరుడు, మానవతావాది ఆయన ఒక్కడేనని యెన్నో ప్రతిపక్షాలు ఘోషించాయి.

ఈ వాదాన్ని మనోహర రెడ్డి ఖండించాడు. తన పేరును యే రాజకీయపక్షమూ వాడుకునేందుకు లేదన్నాడు. అధికారంలోకి వచ్చిన ప్రతి రాజకీయ పక్షమూ ఒకే విధంగా ప్రవర్తిస్తున్నదని ఆయన అన్నాడు. తప్పు చాలా

వరకూ ప్రజలదనీ ప్రజల ఆలోచనల్లో మార్పులు తీసుకుని రావాలనీ ఆయన ప్రబోధించాడు.

ఇలాంటి నీతులు వల్లించడానికేగానీ ఆచరణకు— యే రాజకీయవాదీ ఇష్టపడడు. అందుకు వారు మనోహర రెడ్డిమీద ఆశలు వదులుకున్నారు.

మనోహర రెడ్డి పత్రికలలో వ్యాసాలు రాశాడు. విద్యాసంస్థలలో ఉపన్యాసాలిచ్చాడు. రేడియోలో కూడా మాట్లాడాడు.

కొందరాయన అభిప్రాయాలను మెచ్చుకున్నారు. కొందరు విమర్శించారు. అయితే ప్రజలపైమాత్రం ఆయన అభిప్రాయాల ప్రభావం కనపడలేదు.

రెడ్డికి పదవీ వ్యామోహంలేదు. కీర్తి కాంక్షలేదు.

కానీ ఆయనకు దేశమంటే ప్రేమ, గౌరవం, భక్తి ఉన్నాయి.

మనది ప్రజారాజ్యం.

ప్రజలెన్నుకున్న ప్రజా ప్రతినిధులు ప్రజాక్షేమమే ధ్యేయంగా ప్రజల నేలుకోవాలి. ఆ ప్రజలకు వారి పాలన నచ్చకపోతే ప్రజలు వేరొకరి నెన్నుకుంటారు. అందుకు వీలుగా నియామిత కాలంలో ఎన్నికలు....

ఈ పరిస్థితుల్లో దేశమెంతో సుభిక్షంగా వుండాలి.

కానీ లేదు.

ఎందువల్ల?

"అధికార పక్షం అసమర్థత —" అంటాయి ప్రతిపక్షాలు.

"ప్రతిపక్షాల కుట్ర—" అంటుంది అధికారపక్షం.

నిజానికాయిద్దరిదీ సమాన బాధ్యత—అని మనోహర రెడ్డి గుర్తించాడు.

ప్రజా జీవితం స్తంభించిపోయినా ఫరవాలేదని— బంద్‌లు, సమ్మెలు లేవదీస్తాయి ప్రతిపక్షాలు.

వాటిని అణచివేయడంలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని మరిపిస్తుంది అధికారపక్షం.

సామాన్యుడి గురించే అందరూ మాట్లాడతారు. సామాన్యుడి గోడు మాత్రం యెవరికీ అవసరంలేదు. అసలు వాడేమైపోతున్నాడో యెవ్వరూ ఆలోచించరు.

అధికారాన్ని చేజిక్కించుకోవడం ప్రతిపక్షాల లక్ష్యం.

అధికారాన్ని నిలబెట్టుకోవడం అధికారపక్షం ఆశయం.

అందుకు వారిద్దరూ యేమైనా చేస్తారు. ఎంతకైనా తెగిస్తారు.

మనోహరరెడ్డిలా ఈ విషయాన్ని గుర్తించిన వారెందరో వున్నారు.

తను గుర్తించిన విషయాలను ప్రజలు గుర్తించాలంటే తనకూ ఓ గుర్తింపు అవసరమని మనోహరరెడ్డి చాలా ఆలస్యంగా గుర్తించాడు.

గుర్తింపున్న మనిషి భగవద్గీత గొప్పదంటే—ఏదో కొత్త విశేషం విన్నట్లు అంతా చర్చిస్తారు.

గుర్తింపులేని మనిషి తను బాగుకోరే నిజాలు తెలియ జెప్పినా యెవరూ పట్టించుకోరు.

తన గురించికాక దేశం గురించీ తనకోసంకాక దేశం కోసం ఆలోచించే మనోహరరెడ్డి చివరకు పత్రికా ముఖంగా ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశాడు.

బాధ్యతగల ప్రతిపక్షాలు అధికారపక్షా న్నెవిధంగా వంచవచ్చో ఆయన వారందరికీ చెప్పాలనుకున్నాడు.

ఈ విజ్ఞప్తి ప్రతిపక్షాలలో కొత్త ఊపిరి నింపింది.

నడి సముద్రంలో చుక్కాని లేని నావ లా కొట్టుకు పోతున్న వారికి—ఆధునిక సౌకర్యాలున్న ఓడ కనిపించి నట్లయింది.

"మనోహర రెడ్డి మాట మాకు వేదవాక్కు. ఆయన మాటను అక్షరాలా పాటిస్తాం. ఆయన మావల్ల తప్పున్న దంటే ఒప్పుకుంటాం. ఆయన చెప్పిన విధంగా దిద్దు కుంటాం. ప్రజా క్షేమమే మా ధ్యేయం—" అంటూ ప్రతిపక్ష నాయకులందరూ పత్రికాముఖంగా చెప్పు కున్నారు.

ఇది రాష్ట్రంలో గొప్ప సంచలనాన్ని కలిగించింది.

ప్రతిపక్షాల సమావేశానికి మహాసభ అన్న పేరు పెట్టారు.

మహాసభ నెక్కడ నిర్వహించాలీ అన్న విషయం కూడా పెద్ద పెట్టున చర్చించబడింది.

రాజధానిలో పరిస్థితి అంత బాగోలేదు.

ఏమాత్రం అలజడి రేగినా అక్కడ మతకలహాలు రేగ వచ్చు. మారేదో జరుగవచ్చు.

అదీకాక రాజధానిలో అధికారపక్షానికి ప్రాబల ముంటుంది.

అందుకని వారు శ్రీనాథపురాన్ని తమ సమావేశాని కెన్నుకున్నారు.

శ్రీనాథపురం జనాభా ఆరు లక్షలు.

ఆ ఊళ్ళో ఇరవై ఆరు సినిమా థియేటర్లున్నాయి.

ఊరి చుట్టూ చిన్న చిన్న పరిశ్రమలున్నాయి.

శ్రీనాథపురాన్నానుకుని ఉన్న గ్రామాల్లో బంగారం పండుతుంది. ఆ బంగారానికి వజ్రాలు పొదుగుతుంది

శ్రీనాథపురం.

మిగతా రాష్ట్రంలో కనపడే పేదరికం అక్కడ కనపడదు. అక్కడ ఎక్కువమంది విద్యార్థులు. విద్యార్థులు కానివారికి రాజకీయాల గురించి పట్టించుకునే టంత తీరుబడిలేదు.

శ్రీనాథపురంలో ప్రతిపక్షాల మహాసభ నిర్వహించబడుతుందని ప్రకటించబడగానే ఆ ఊళ్ళో పెద్ద సంచలనం కలిగింది.

అంతవరకూ శ్రీనాథపురం గురించి ఎవరికీ ఎక్కువగా తెలియదు. ఇప్పుడు శ్రీనాథపురం గురించి పత్రికల్లో ఎన్నో వివరాలు....ఆ ఊరి పుట్టుకతో మొదలై, రాష్ట్ర చరిత్రలో ఆ ఊరికున్న స్థానంవరకూ ఎన్నో విశేషాలు సమగ్రంగా తెలుపబడ్డాయి.

మహాసభ గురించిన ప్రయత్నాలు మూడు మాసాలకు ముందే ప్రారంభించబడ్డాయి.

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం. ఆ రోజు పతాక వందనం అనంతరం మహాసభ ప్రారంభం కావాలని మనోహర రెడ్డి నిర్ణయించాడు.

మనోహర రెడ్డిని మరో మహాత్మాగాంధీ అన్నట్లు ప్రతిపక్షాలు చిత్రిస్తున్నాయి.

మహాసభ ప్రారంభం దగ్గర పడుతోంది.

2

ముఖ్యమంత్రి ముఖంలో దిగులు....

ఆయన ఎదురుగా కూర్చుని వున్నాడు ప్రధాన సలహాదారు ప్రతిభేశ్వర్.

"రెడ్డి గారింతపని చేస్తారనుకోలేదు—" అన్నాడు ముఖ్యమంత్రి.

"ఆయన ముందుగా మననే కలుసుకున్నారు. మీరు గుర్తుచేసుకోండి—" అన్నాడు ప్రతిభేశ్వర్.

ముఖ్యమంత్రికి గుర్తుంది. మనోహర రెడ్డి తనను కలుసుకుని పరిపాలనా విధానాలలో మార్పులు సూచించాడు. ముఖ్యమంత్రి అంగీకరించలేదు. తను ప్రజల మనిషిననీ, ప్రజలకోసం తానేమైనా చేయగలననీ, తనమీద ప్రజలకు విశ్వాసముందనీ, వేరొకరి పద్ధతిలో తను ప్రజాపాలన చేయలేననీ ముఖ్యమంత్రి మనోహర రెడ్డికి చెప్పాడు.

అప్పుడు మనోహర రెడ్డి ఆయన్ను—"మీరు తప్పుచేస్తే ప్రజలకది నచ్చదు. మీరు తప్పుచేశారనీ ప్రజలకది నచ్చలేదనీ మీరెలా తెలుసుకుంటారు?" అనడిగాడు. అందుకు తన పద్ధతులు తనకున్నాయనీ, ఒకరికి చెప్పేవి కావనీ ముఖ్యమంత్రి ఆయనతో అన్నాడు. అప్పుడు తను ప్రతిపక్షాలను కలుసుకుంటానని మనోహర రెడ్డి అంటే—"అది మీ యిష్టం—" అని కూడా ముఖ్యమంత్రి చెప్పాడు.

"నువ్వు చెప్పింది నిజమే! ఆయన అన్నీ మనకు ముందే చెప్పాడు. కానీ అదింతకు దారితీస్తుందనుకోలేదు. రెడ్డిగారికి ప్రచారాలు గిట్టవు. ఆయన పేరున ఇంత ప్రచారం జరిగిపోతే ప్రజల్లో తప్పక సంచలనం కలుగుతుంది—" అన్నాడు ముఖ్యమంత్రి.

"ప్రతిపక్షాలు రెడ్డిగారి పేరు నుపయోగించుకుంటున్నాయి...." అన్నాడు ప్రతిభేశ్వర్.

"అవును. ఆయన ఆశయాలు వాళ్ళు పాటించగలరని నేననుకోను. ఈ అవకాశాన్ని వాళ్ళుపయోగించుకుంటున్నారంతే!" అన్నాడు ముఖ్యమంత్రి.

"రెడ్డిగారికి ప్రతిపక్షాలమీద సదభిప్రాయం లేదు. ఆయన పేరును మనముపయోగించుకుంటే ప్రతిపక్షాలు

రూపురేఖలు లేకుండాపోయేవి—" అన్నాడు ప్రతిభేశ్వర్.

"నిజమే! కానీ మన స్థానం బలంగా వుంది. అందుకని ప్రతిపక్షాలను తుడిచిపెట్టే ఆలోచన చేయలేదు...." అన్నాడు ముఖ్యమంత్రి సాలోచనగా.

"రెడ్డిగారంటే ప్రజల్లో విలువ వుంది. ప్రతిపక్షాలాయనకో ప్రత్యేకమైన గుర్తింపు నిచ్చాయి. ఇప్పుడాయన పలికే ప్రతిఅక్షరం మనకు వ్యతిరేకం కావచ్చు" అన్నాడు ప్రతిభేశ్వర్.

"ప్రజలు నన్నే వ్యతిరేకిస్తారంటావా?" అన్నాడు ముఖ్యమంత్రి.

"ప్రజలు మనుషుల్నే తప్ప—వారు చేసే పనుల్ని చూడరు....మహాసభను మనమంత తేలికగా తీసుకుందుకు లేదు—" అన్నాడు ప్రతిభేశ్వర్.

"నేను ప్రజలకెంతో చేశాను. ఇంకా ఎంతో చేయాలనుకుంటున్నాను. దీనికేమీ విలువలేదా?"

"మీకు తెలియనిదేముంది? మీరేం చేశారన్నది ప్రజలకక్కర్లేదు. మీరేం చేశామని ప్రచారం చేసుకుంటున్నారో అదే ముఖ్యం. మీ ప్రచారం మీకు శ్రీరామరక్ష, ప్రతిపక్షాల ప్రచారం మీకు ప్రమాదం. ఆ ప్రమాదాన్ని మీరెదుర్కోవాలి. ఆరంభంలోనే త్రుంచేయాలి...."

"ఎలా?"

"ప్రతిపక్షంలో చీలికలు తేవాలి...."

"అది వీలుపడుతుందా?"

"అందుకెన్నో మార్గాలున్నాయి...."

ముఖ్యమంత్రి సాలోచనగా—"రెడ్డిగారి విషయం

యేమీ చేయలేమా?" అన్నాడు.

"రెడ్డిగారి కన్నా ముఖ్యమంత్రి పదవిమీద పడిందని కొందరిచేత అనిపించాలి—" అన్నాడు ప్రతిభేశ్వర్.

"ఆకాశంమీద ఉమ్మితే అది మనమీదే పడుతుంది. ప్రజల్లో మనకున్న గౌరవం నిలుపుకోవాలంటే మనం రెడ్డిగారి జోలికి వెళ్ళడం మంచిదికాదు...."

"మనంగానీ — మన పార్టీలో యే ఒక్కరుగానీ రెడ్డిగారి జోలికి వెళ్ళరు. ఆయన గురించి ఒక్క పొల్లు మాట అనరు. పైగా మనమందరం రెడ్డిగారిపట్ల గౌరవం వ్యక్తపరుస్తూ — ఆయనవంటి మహానుభావుడు పూనుకోవడంవల్ల ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా ఆలోచించ గల్గుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తపరుద్దాం...."

"మరి రెడ్డిగారి గురించిన పొల్లుమాట లెవరంటారు?"

"కొందరు ప్రతిపక్షాలవాళ్ళు...."

ముఖ్యమంత్రి అసంతృప్తిగా—"ఛా— రెడ్డిగారిమీద పొల్లుమాట పడడం నాకే యిష్టం లేదు—" అన్నాడు.

"ఇందులో మనం చేసినదేముంది? రాజకీయాల బురదలో ఆయన తనకు తానే ప్రవేశించారు. ఇనుముతో కలియుడంవల్ల అగ్నికికూడా సమ్మెటపోట్లు పడతాయి గదా" అన్నాడు ప్రతిభేశ్వర్.

"ఈ విషయమై నేనూ తీవ్రంగా ఆలోచిస్తాను" అన్నాడు ముఖ్యమంత్రి.

3

అంతర్జాతీయ స్మగ్లర్ ఆజాద్ గురించి యెన్నో కథలు ప్రచారంలో వున్నాయి.

అతదే దేశానికి చెందినవాడో తెలియదు. అసలు పేరు కూడా తెలియదు కానీ అతడికి పద్నాలుగు భారతీయ

భాషలు క్షుణ్ణంగా వచ్చు. భారతదేశంలో యే ప్రాంతంలో వున్నప్పటికీ అతడా ప్రాంతానికి చెందినవాడనే అంతా భ్రమపడతారు.

ప్రస్తుతం అతడు శ్రీనాథపురం చేరినట్లు వార్త వచ్చింది.

శ్రీనాథపురంలో పోలీసులు ఊరంతా వలపన్ని అతడి కోసం గాలిస్తున్నారు.

వేషాలు మార్చడంలో ఆశానాథ్ దిట్ట. ఈ క్షణంలో రొమాంటిక్ యంగ్ హీరోగా కనబడి మరుక్షణంలో అతడు మూడుకాళ్ళ ముసలిగా మారిపోగలడు.

ముఖ్యంగా ఆశానాథ్ ఆడపిల్లలను వలలో వేసుకోవడంలో సమర్థుడు.

పోలీసులీ విషయమై నగర పౌరులను హెచ్చరించారు. ముఖ్యంగా ఆడపిల్లలను జాగ్రత్తగా వుండమని వారు మరీ మరీ హెచ్చరించారు.

పోలీసులంతటితో ఆగలేదు.

హోటళ్ళలో—బీచి, పార్కు, థియేటర్ల వగైరా ప్రాంతాలల్లో విడిగా కనబడిన ప్రతిజంటనూ వారు ప్రశ్నించి వివరాలు తెలుసుకోనిదే వదిలేవారు కాదు.

ఇది నగర పౌరులకి ఇబ్బందిగా కూడా పరిణమించింది

ఏ అమ్మాయైనా తన అన్నతో బయటకు రావాలన్నా భయపడసాగింది. అమ్మాయిల్లో ప్రియులు మోసగిస్తారన్న భయంకంటె పోలీసులు జులుం చేస్తారన్న భయమే యెక్కువగా వుంది.

ఇలా ఉండగా అప్పుడే యిద్దరమ్మాయిలు మాయమై పోయారన్న వార్త ఊరంతా కార్చిచ్చులా వ్యాపించింది.

శ్రీనాథపురంలో అప్పుడు డిటెక్టివ్ కిల్లర్ తన

మొబైల్ వ్యానుతో సహా ప్రవేశించాడు. అతడితో పాటు ఓ అందమైన అమ్మాయికూడా ఊళ్ళో ప్రవేశించింది.

స్మగ్లర్ ఆశానాథ్‌ను పట్టుకోవాలన్నది డిటెక్టివ్ కిల్లర్ జీవితాశయాల్లో ఒకటి. అతడు శ్రీనాథపురంలో వున్నాడని తెలియగానే కిల్లర్ ఓ పథకం తయారు చేసుకుని అక్కడకు వచ్చాడు. ఆ పథకంలోని భాగమే ఆ అందమైన యువతి.

ఆమె పేరు నళిని.

ఆమెకు అందముంది. బియ్యేదాకా చదువూ ఉంది.

ఆమె ఉద్యోగానికి ప్రయత్నించింది.

ఉద్యోగం సంపాదించాలంటే అందం కావాలి. ఆ ఉద్యోగాన్ని నిలబెట్టుకుందుకూ అందం కావాలి.

ఒంటరి ఆడదానికోసం ఎన్నో మగతోడేళ్ళు ఆకలితో పొంచివుంటాయని ఆమె గ్రహించింది. ఆ తోడేళ్ళ బారినుండి తప్పించుకునే మార్గం తెలియక క్రమంగా ఆమె వాటిని దగ్గరకు రానిచ్చి మచ్చిక చేసుకోసాగింది.

ఆడది నీతిని వదిలిపెట్టాలిగానీ — మగతోడేళ్ళు పెంపుడు కుక్కగా మారడానికెంతో సేపు పట్టదని ఆమె అర్థంచేసుకుంది. ఎటొచ్చీ తను తెలివిగా వ్యవహరించాలి.

ఉద్యోగం నిలబెట్టుకునేందుకు ఉపయోగించాల్సిన అందాన్ని — ధనసంపాదన కుపయోగించసాగిందామె. అందువల్ల సమాజంలో పడిపోయే ఆమె విలువను డబ్బు నిలబెట్టింది.

తెలివైన యువతి నళిని.

ఆమెనోసారి కలుసుకున్నాడు కిల్లర్. ఆమె అందం కంటే తెలివి అతణ్ణి ఆకర్షించింది—“కలకాలం నీ

జీవితాన్నిలా వృధా చేసుకోకు. ఇప్పుడు నీవద్ద కొంత డబ్బు చేరింది. ఇక ఉద్యోగంలో ప్రవేశించు. అధికారి అన్యాయంగా ప్రవర్తిస్తే తిరగబడి వాడి జాతకం బైట పెట్టు. ఓ మంచి మగాణ్ణి పెళ్ళిచేసుకో. నీ అందం, డబ్బు చూసి యెవడో ఒకడు ముందుకు వస్తాడు. నీ తెలివితో సరైనవాణ్ణి అంచనా వేయి. ఆ తర్వాత నీ తెలివితోనే వాణ్ణి ఆకట్టుకో. నీకు శుభం జరుగుతుంది" అని అతడామెకు సలహా యిచ్చాడు.

"నాకిప్పుడుద్యోగం దొరకదు—" అందామె.

"నీ వయసు పాతికేళ్ళుండవచ్చునేమో గానీ ఇప్పుడు చూడ్డానికి పద్దెనిమిదేళ్ళ పాపలాగున్నావు. ఏ ప్రయివేటు కంపెనీలోనైనా నీ కుద్యోగం దొరుకుతుంది...."

"ప్రయివేటు కంపెనీ వాళ్ళు నాకు భయపడరు...."

"పోనీ యే బట్టల షాపులోనైనా సేల్సుగర్లుగా పనిచేయి. అక్కడ నీ అందాన్నితరుల ఆకర్షణకే తప్ప తమకోసం ఉపయోగించుకోవాలనుకోరు నీ యాజమానులు...."

"మీరే నాకు రికమెండేషన్ చేయండి...."

"చేస్తాను. నువ్వు నాతో వచ్చి కొన్నాళ్ళుంటే?"

నళిని ఆశ్చర్యపడింది. అతడు ఆశానాథ్ గురించి చెప్పాడు.

ఆమె ఒప్పుకుంది.

ఇద్దరూ యిప్పుడు శ్రీనాథపురంలో వున్నారు.

అక్కడ వన్ టవున్ పోలీస్టేషన్లో ఇన్ స్పెక్టర్ కుమారస్వామితో కిల్లర్ కి పూర్వపరిచయముంది.

ముందతడక్కడకే వెళ్ళాడు. కూడా నళిని వెళ్ళలేదు. ఆమె సరాసరి ఒక హోటలు గదిలో దిగింది.

"ఆశానాథ్ శ్రీనాథపురం వచ్చిన వార్త పోలీసుల దాకా ఎలా వచ్చింది?" అన్నది కిల్లర్ కుతూహలం.

దీనికి కుమారస్వామి సరైన జవాబివ్వలేకపోయాడు.

"బహుశా—స్థానిక పత్రికల్లో వార్తగా వచ్చినట్టుంది—" అన్నాడతడు.

"ఆ వార్త వారికెలా వచ్చిందిట?"

"ఎవడో ఆకాశరామన్న ద్వారా—ఇలాంటి కబురు పబ్లిగ్గా అందజేయగల ధైర్యమెవరికీ ఉండదు...."

"ఇంతకీ ఆశానాథిక్కడున్నాడనడానికి సరైన ఋజువులున్నాయా?"

"ఉన్నాయి...."

"ఏమిటవి?"

"ఆశానాథ్ చిత్రమైన మనిషి. ముందుగా అతడో హోటలు రూం బుక్ చేసుకుంటాడు—టెలిఫోన్ ద్వారా. ఏ కుర్రాడిద్వారానో డబ్బు పంపిస్తాడు. రూం ఆశానాథ్ పేరిట బుక్కవుతుంది. కానీ అతడా రూంలో వుండడు. ఇంకెవరో ఉంటారు...."

"అతడు ఆశానాథ్ మనిషా?"

"కాదు. హోటల్ గది అవసరమున్న మనిషిని రైల్వేస్టేషన్ దగ్గరో పట్టుకుంటాడతడు. తన గది ఖాళీగా ఉందని కారణాంతరాలవల్ల తను గదికి వెళ్ళడం పడలేదని అంటాడు. ఊరికే రూం వచ్చింది కదా అని ఆ వ్యక్తి ఆశానాథ్ రూంకి వెడతాడు. ఆశానాథ్ రహస్యంగా అతణ్ణో కంట కనిపెడతాడు. అతడిమీద పోలీసుల నిఘా లేకపోతే తనకు రావలసిన వస్తువులతడికి చేరేలా చేసి—అప్పుడతణ్ణించి రాబట్టుకుంటాడు."

"ఇది మీకెలా తెలుస్తుంది?"

"అశానాథ్ రూం తన పేరుతోనే బుక్ చేసుకుంటాడు...."

"ఇప్పుడూ అలాగే జరిగిందా?"

"అవును. ఊళ్ళోని మంచి హోటల్సన్నింటికీ మేము ఫోన్స్ చేశాం. జయంతీ లాడ్జిలో అశానాథ్ పేరిట రూం బుక్కయింది. అందులో కృష్ణమూర్తి అనే అమాయకుడుంటున్నాడు. అతడికి వారం రోజులిక్కడ పని వుంది. అన్ని రోజులూ అతడి గది అద్దె అశానాథ్ కట్టాడు.... మాకు మాత్రం అశానాథ్ ఆచూకీ లేదు."

కిల్లర్ సాలోచనగా తలపంకించి — "ఇంకేమైనా ఋజువులున్నాయా?" అన్నాడు.

"అశానాథ్ కు ఆఫ్రికన్ బెల్లీ డ్యాన్సంటే యెంతో ఇష్టం. అతడే ఊళ్ళోదిగినా— ఓ హోటల్లో ఆ డ్యాన్స్ యేర్పాటు చేయించుకుంటాడు. ఇప్పుడుకూడా నటరాజ్ హోటల్లో అతడి కోరికమీద జూలీ అనే ఓ అమ్మాయి బెల్లీ డ్యాన్స్ చేసింది. ముందుగా సమాచారం తెలిసి కొందరు పోలీసులుకూడా మఫ్టీలో ఆ డ్యాన్సు చూడ్డానికి వెళ్ళారు. అక్కడ అశానాథ్ ఆచూకీ బొత్తిగా తెలియలేదు...."

"ఊఁ....ఇంకా యేమైనా ఋజువులున్నాయా?" అన్నాడు కిల్లర్ కుతూహలంగా.

"ఊళ్ళో ఓ స్కూటర్ దొంగతనం జరిగింది. కారు దొంగతనం జరిగింది. ఆ తర్వాత అవి యెక్కడో దొరికాయి. అంటే అశానాథ్ వాటిని తన ప్రయోజనానికి వాడుకుని వదిలి పెట్టాడన్నమాట. తర్వాత ఊళ్ళో యిద్దరమ్మాయిలు అపహరించబడ్డారు. వారి ఆచూకీ యింతవరకూ తెలియలేదు. ఇవన్నీ అశానాథ్ ఉనికిని

తెలియజేస్తున్నాయి...."

"ఇంతకీ అశోనాథ్ ఇక్కడికెందుకు వచ్చినట్లు?"

"అది మాత్రం యెవరూ చెప్పలేరు. అతడికి తప్పకుండా ఇక్కడో మనిషుండి వుండాలి. పోలీసులు నగరంలో అనుమానమున్న ప్రముఖులందరిపైనా కన్నువేసి వుంచారు. అనుమానించాల్సిన విశేషమేమీ జరుగలేదు."

"అపహరించబడ్డ ఇద్దరమ్మాయిల వివరాలు కావాలి నాకు...."

ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి అతడికా వివరాలు చెప్పాడు.

"చాలా థాంక్స్" అంటూ కిల్లర్ అక్కణ్నుంచి లేచాడు.

4

బీచివద్ద ఒంటరిగా కూర్చుంది నళిని.

అలలకూ ఆమెకూ యెంతో దూరంలేదు.

ఉన్నట్లుండి ఓ కెరటం ఉవ్వెత్తున లేచింది. ఓ క్షణమాగితే అదామెను ముంచేసేదే!

ఎవరో ఆమెను చరచరా వెనక్కు లాగారు.

నళిని కెరటంనుంచి తప్పించుకుంది. కానీ వెల్లకిలా పడిపోయింది. ఆమెకప్పుడో యువకుడి ముఖం కనిపించింది.

"నా పేరు శశికాంత్ — ఇందాకట్నుంచి నిన్ను చూస్తున్నాను. ఈ అందం సముద్రంపాలై పోతుందని భయపడ్డాను—" అన్నాడతడు.

నళిని లేచి కూర్చుని పైట సవరించుకొని-"థాంక్స్-" అంది.

"నేను నీతో మాట్లాడాలొచ్చా—" అన్నాడతడు.

"ఊఁ" అందామె.

అతడామె యెదురుగా కూర్చున్నాడు.

ఆమె అతణ్ని చూసింది.

"నేను సూటిగా అడుగుతాను. ఏమీ అనుకోకూడదు.

"ఊఁ" అందామె.

"ఎక్కడుంటున్నావు నువ్వు?"

ఆమె చెప్పింది.

"వెరీగుడ్ — నేనూ నీతో వస్తాను...." అన్నాడతడు.

"ఎందుకు?" అందామె.

"ఆ ప్రశ్న నీ అందాన్నడుగు...."

"అంటే?"

"అందమంటే తెలియదా? అది నీ దుస్తుల మరుగున దాగి వుంది...."

నళిని కోపంగా "ఏయ్ మిస్టర్ ....ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" అంది.

"ఇందులో నాకు చాలా అనుభవముంది. నీ చూపులు చూసి పసిగట్టాను. నువ్వు సంసార స్త్రీవి కావు. నాబోంట్లకు వరప్రసాదానివి...."

నళిని ముఖం ఎర్రబడింది — "యూ ఆర్ టాకింగ్ రబ్బిష్—" అంది.

అతడు జేబులోంచి — రెండు వందనోట్లు తీసి — "ఇది అడ్వాన్స్ — ఉంచుకో —" అన్నాడు.

నళిని డబ్బు తీసుకోలేదు — "గెటౌట్ —" అంది.

"నువ్వు నన్ను నీ గదికి తీసుకువెళ్ళకపోతే నేను నిన్ను నా గదికి తీసుకొని వెడతాను—" అన్నాడతడు.

"అంతా నీ యిష్టమేనా?"

"నా యిష్టం చాలా భయంకరంగా వుంటుంది. నా మాట విని మర్యాదగా నన్ను నీ గదికి తీసుకొని వెళ్ళు.."

అన్నాడతడు.

"సరే—...." అంది నళిని.

ఇద్దరూ అక్కణ్నించి వెంటనే బయల్దేరి లాడ్జికి వెళ్ళారు.

తలుపు తాళం తనే తీసింది నళిని.

ఇద్దరూ లోపల ప్రవేశించారు. అతడు తలుపు గడియ వేశాడు.

"గడియెందుకు వేశావు?" అందామె.

"ఇంకెవరూ లోపలకు రాకుండా!" అన్నాడతడు.

"ఎందుకు రాకూడదు?"

"నేను నీ అందాన్ని — ఒక్కణ్ణే చూడాలి...."

"చూశావుగా...." అందామె.

"అందం నీ శరీరంలో ఉంది. ఆ శరీరాన్ని దుస్తులు కప్పాయి...."

"కూర్చో—" అందామె.

"కూర్చోను—పడుకుంటాను...." అన్నాడతడు.

"నీ యిష్టం...."

"నువ్వూ పడుకో...." అన్నాడతడు.

"నేనలాంటిదాన్ని కాదు...."

"నువ్వెలాంటిదానివో నీ చూపులే చెబుతున్నాయి."

"అవి చూసేవారి కళ్ళలో ఉంటుంది—"

"మరి ఒక్కర్తివీ ఈ ఊర్నొచ్చి-డబుల్ రూమెందుకు తీసుకున్నావు? ఈ గదిలో డబుల్ కాటెందుకుంది?"

"నీ ప్రశ్నకు నేను బదులిస్తాను...."

కొత్త మాట విని ఉలిక్కిపడ్డాడు శశికాంత్.

అతడు వెనక్కి తిరిగేసరికి అక్కడ కిల్లర్ ఉన్నాడు.

కిల్లర్ నవ్వుతున్నాడు.

"మావారు.... పేరు కిల్లర్ ...." అంది నళిని.

"అయామే కిల్లరాఫ్ క్రిమినల్స్...." అన్నాడు కిల్లర్.

శశికాంత్ అతణ్ని భయంగా చూస్తున్నాడు.

"నీ కథేమిటో చెప్పు...." అన్నాడు కిల్లర్.

"నేను రావాలని రాలేదు. ఆమే నన్ను పిలిచింది.."

"ఎందుకు?"

"తన అందం చూపిస్తానంది...."

"ఎందుకట?"

"డబ్బు కావాలిట...."

"ఓహో—మరి ఆమె తనే నన్ని గదిలో ఉంచి తాళం వేసి బయటకు వెళ్ళింది. లోపలకు నిన్ను తెచ్చిందంటే అర్థమేమిటి?"

"బరి తెగించిన ఆడది...."

మరుక్షణం శశికాంత్ చెంప ఛెళ్ళుమంది.

"ఆమె కాళ్ళుపట్టుకో—" అన్నాడు కిల్లర్.

అతడు ప్రతిఘటించి విఫలుడయ్యాడు. చివరికి గతిలేక అతడామె కాళ్ళు పట్టుకున్నాడు.

"నేనెవరో నీకు తెలియదు. ఇంతకింతా అనుభవిస్తావు...."

"ఎవరుట నువ్వు?"

"నాది హైదరాబాదు. మా నాన్నది ముత్యాల వ్యాపారం...."

"మీ నాన్నను అభినందించాలి—నీలాంటి ముత్యాన్ని

కన్నందుకు...."

నళిని కిసుక్కున నవ్వింది.

"నాన్నకు నీ గురించి తెలిస్తే — నువ్వీభూమ్మీద మిగలవు...."

"మీ నాన్నకు నా గురించి తెలిసేముందు—లోకానికి మీ గురించి తెలుస్తుంది. హహా దూయూ లైకిట్...." అన్నాడు కిల్లర్.

శశికాంత్ మాట్లాడలేదు.

కిల్లర్ నవ్వుతూ—"ఆమెను అందం చూపిస్తే డబ్బిస్తానన్నావు. నేనూ నీకు డబ్బిస్తాను. నీ అందం చూపిస్తావా?" అన్నాడు.

శశికాంత్ మొండిగా—"డబ్బక్కర్లేదు. నా అందం మీరెవరైనా చూడొచ్చు—" అన్నాడు.

"థాంక్యూ-అయితే ఊరందరికీ నీ అందం చూపిద్దువు గాని. నిన్ను వీధుల్లో తిప్పుతాను...."

అప్పుడా యువకుడి ముఖంలో భయం కనబడింది—"వద్దు" అన్నాడు.

"నళినీ—పోలీసులకు ఫోన్ చేసి పిలు...." అన్నాడు కిల్లర్.

కాసేపట్లో ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి ఆ గదిలోకి వచ్చాడు. కిల్లర్ అతకి జరిగింది చెప్పాడు.

"అంతా అబద్ధం!" అన్నాడు శశికాంత్.

"నళినీ—నీ వ్యానిటీ బ్యాగులోని కాసెట్ తీసి ఇన్‌స్పెక్టర్ గారికివ్వు—" అన్నాడు కిల్లర్.

"మీరు టేపురికార్డరుతో నన్ను పట్టుకుందుకు వచ్చేరా?" అన్నాడు శశికాంత్ ఆశ్చర్యంగా, భయంగా.

"మేకను ఎరవెడితే — తినడానికి వచ్చేవి క్రూర మృగాలే కదా! నేను నిన్ను ప్రత్యేకించి పట్టుకోవాలను కోలేదు. ఒకరికోసం చూస్తూంటే నువ్వు దొరికావు-" అని కుమారస్వామివంక తిరిగి-"బహుశా ఇద్దరమ్మాయిల అపహరణలో ఇతడి పాత్రకూడా ఉంటుంది. తగిన విధంగా మర్యాదచేసి నిజం చెప్పించు" అన్నాడు కిల్లర్.

"నాకేం తెలియదు. ఈ విషయంలో పొరపాటై పోయింది...." అన్నాడు శశికాంత్ గోల పెడుతూ.

ఇన్‌స్పెక్టర్ అతణ్ని తీసుకొని వెళ్ళిపోయాడు.

"చాలా చిత్రంగా వుంది" అంది నళిని వాళ్ళు వెళ్ళి పోయాక.

"మనిషి చాలా పొగరుబోతులా వున్నాడు. అంతా పెంపకం లోపం. అసలిక్కడికెందుకు వచ్చాడో?" అన్నాడు కిల్లర్ సాలోచనగా.

"అతడే ఆశానాథ్ అయుండవచ్చునేమో!" అంది నళిని.

"ఇంత సులభంగా దొరికిన వాడికి మానసిచ్చి ఉం టుంది తప్పితే—ఇతడు ఆశానాథ్ అయుండే అవకాశం లేదు—" అన్నాడు కిల్లర్.

"ఒకవేళ అతడే ఆశానాథ్ అయితే..." అంది నళిని.

"అప్పుడు నువ్వూ నేనూ కూడా మిగలం...."

నళిని కళ్ళలో భయం....

కిల్లర్ కనులలో ఆలోచన....

5

తప్పిపోయిన ఇద్దరమ్మాయిల గురించీ వాకబు చేశాడు కిల్లర్.

తలిదండ్రులు వారి గురించి సరైన సమాచారమివ్వ

లేదు.

ఇద్దరమ్మాయిలూ అందగత్తెలు. వయసు పదిహేడుకీ ఇరవైకీ మధ్య. ఒకామె బియ్యే చదువుతోంది. ఇంకోకామె టైపిస్టుగా పని చేస్తోంది.

ఆ పిల్లల గురించి వాకబు చేయడం తలిదండ్రులకు నచ్చలేదు.

"పరువుగా బ్రతుకుతున్నాం. ఈ కథ రట్టు చేయకండి—" అని వారు వేడుకున్నారు.

కన్న కూతురు మాయమయిందన్న చింతకంటె—ఆ విషయం మాయనిమచ్చగా తమ కుటుంబాన్ని పీడిస్తుందన్న బాధ వారిలో యెక్కువగా కనిపిస్తోంది.

అందుకే వారి వివరాలు పత్రికల్లో రావడానికి కూడా వారంగీకరించలేదు. విషయం వీలైనంత రహస్యంగా వుంచమని వారు పోలీసుల్ని కోరారు.

"మీరు నాకు సహకరిస్తే నేను వాళ్ళను వెనక్కు తేగలను—" అన్నాడు కిల్లర్.

"పరువు పోయాక వాళ్ళు తిరిగొచ్చి ఏం లాభం?"

ఇదీ వారి తలిదండ్రుల భయం ప్లస్ అభిప్రాయం.

కిల్లర్ బియ్యే చదువుతున్న అమ్మాయి గురించి ఆ చుట్టుపక్కల వాకబు చేశాడు.

క్రమంగా కొన్ని విశేషాలు బయటపడ్డాయి.

ఆ అమ్మాయో కుర్రాణ్ని ప్రేమించింది. పెళ్ళి చేసుకుంటానంటే యింట్లో ఒప్పుకోలేదు. ఇంట్లో ఆమెకు ఆంక్షలు పెరిగాయి. ప్రేమికులు కలుసుకోకుండా కట్టుదిట్టాలు కూడా చేశారామె తలిదండ్రులు.

ఇప్పుడా అమ్మాయి మాయమయిందంటే—

వాళ్ళిద్దరూ కలిసి ఎక్కడికైనా వెళ్ళిపోయుండాలి-

లేదా నిజంగానే ఆ అమ్మాయి అపహరించబడి వుండాలి.

చుట్టుపక్కలవారి అభిప్రాయం ప్రకారం-ఆశానాథ్ ఊళ్ళో అడుగుపెట్టాడన్న వార్తను ఆ అమ్మాయి తలిదండ్రులుపయోగించుకున్నారు. తమ పరువు పోకుండా ఈ విధంగా నిలబెట్టుకోవాలనుకుంటున్నారు. అమ్మాయి చేసిన వెధవ పనికి నలుగురూ ముఖాన ఉమ్మివేయకుండా తమమీద జాలిపడాలని తాపత్రయపడుతున్నారు.

ఇంచుమించు టైపిస్టమ్మాయి కథకూడా యిదే!

దేశంలోని కొందరాడపిల్లల పరిస్థితి చూస్తే కిల్లర్‌కి జాలి వేసింది. అతడా ఆడపిల్లలిద్దరి ప్రియుల గురించీ ఆచూకీ తెలుసుకోవాలని ప్రయత్నించాడు — కానీ లభించలేదు.

ఆ పిల్లలు మాయం కావడానికీ ఆశానాథ్‌కీ అట్టే సంబంధముండకపోవచ్చునని అతడికి తోచింది.

అయినప్పటికీ ఈ విషయంలో పోలీసులేం చేస్తున్నారో తెలుసుకుందుకు ప్రయత్నించా డతడు.

"అంతా పత్రికలవాళ్ళ హడావుడి. ఆ పిల్లలు మాయం కావడానికీ ఆశానాథ్‌కీ సంబంధమున్నట్లు వాళ్ళు చేస్తున్న ఊహాగానాలకి ఋజువులు లేవు. ఆ కేసులింకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. ఎందుకంటే ఆ పిల్లలు ప్రముఖులకి సంబంధించిన వారు కాదు. పిల్లల తలిదండ్రులు వారి గురించి ఒత్తిడి తీసుకొని రావడంలేదు."

ఇదీ పోలీసుల సమాధానం.

6

శశికాంత్ గురించి హైదరాబాదునుంచి అతడి తండ్రి వచ్చాడు.

"వాడు దుడుకు మనిషి. దుర్మార్గుడు కాదు. ఇంత

వరకూ వాడెలాంటి నేరమూ చేయలేదు—" అన్నాడాయన పోలీస్ స్టేషన్లో.

"ఇప్పుడు చేశాడు...." అన్నాడు కుమారస్వామి.

"ఇప్పుడూ చేయలేదు. మా వాడిననుమానించే ముందు- ఆ పిల్ల పుట్టుపూర్వోత్తరాలు లాగండి. అసలు సంగతి తెలుస్తుంది—" అన్నాడు శశికాంత్ తండ్రి.

"ముందు మీ వాడి పుట్టుపూర్వోత్తరాలు లాగుతాను...."

"నేను వాడి తండ్రిని—"

"పదే పదే ఆ విషయం చెప్పుకోవడంవల్ల మీ విలువ తగ్గుతుంది. మీ అబ్బాయి విలువ పెరగదు—"

"మనుషుల విలువ ముత్యాల విలువలా పెంచగలను— తగ్గించగలను. అంతా నా చేతుల్లో వుంది-" అన్నాడు శశికాంత్ తండ్రి.

"అయితే మీరు చేయగలిగింది చేయండి...."

"చేయాలనే వచ్చాను-" అన్నాడు నర్మగర్భంగా శశికాంత్ తండ్రి.

ఆ చూపులు కుమారస్వామికి అర్థమయ్యాయి. అతడికి కొత్తకాదు. ఆ చూపుల్లో ముత్యాల మేఘాలున్నాయి. తను రవంత చల్లబడితే ముత్యాలవాన కురుస్తుంది.

"మీరు చేయగలిగింది స్టేషన్ బయట చేయండి. లోపల చేసేదంతా మేము...."

అతడి మాటల్లో మేఘాలను తరిమే పెనుగాలి కరుకుదనముంది. శశికాంత్ తండ్రికి ఆ కరుకుదనం అర్థమయింది.

క్రమంగా మెత్తబడి—"మళ్ళీ యిలాంటి పొరపాటు జరగదు. నేను హామీ ఇస్తున్నాను. మా వాణ్ని వదిలిపెట్టండి—" అన్నాడు.

"అది నా చేతుల్లో లేదు...."

"మరెవరి చేతుల్లో ఉంది?"

"డిటెక్టివ్ కిల్లర్!"

"ఆయనెక్కడుంటాడు?"

కుమారస్వామి వివరాలు చెప్పాడు.

శశికాంత్ తండ్రి నళిని వుండే హోటలు గదికి వెళ్ళాడు.

అప్పుడు కిల్లర్ గదిలోనే వున్నాడు.

"నేను శశికాంత్ తండ్రిని—" అంటూ ఆయన తన్ను తాను పరిచయం చేసుకున్నాడు.

ఆయన కనులలో ముత్యాల మబ్బులు కదులుతున్నాయి.

కిల్లర్ ఆయన శశికాంత్ తండ్రి అయినందుకు జాలిపడ్డాడు.

"మావాడు మీకే మపకారం చేశాడు? మీరు కావాలని వాణ్ని ట్రాప్ చేసి పోలీసుల కప్పగించారు-" అన్నాడాయన యేడుపు గొంతుతో.

"నేను కావాలని ట్రాప్ చేయలేదు. మీవాడే కావాలని ట్రాప్‌లో పడ్డాడు—" అన్నాడు కిల్లర్

"అసలు ట్రాప్ ఎందుకూ?"

"ఆశానాథ్ కోసం...."

"ఆశానాథ్ ఎవరు?"

కిల్లర్ చటుక్కున—"ఆశానాథ్ యెవరో తెలియకుండానే మీరు ముత్యాల వ్యాపారంలో ఉన్నారంటే నేను నమ్మను—" అన్నాడు.

శశికాంత్ తండ్రి తడబడ్డాడు. కాసేపాగి—"ఆశానాథ్‌కీ మీకూ వైరమెందుకు?" అన్నాడు.

"దుష్టశిక్షణ..అంతే!" అన్నాడు కిల్లర్.

"ఆశానాథ్ కు బదులు మావాడిని పట్టుకున్నారేం?"

"మీవాడూ దుష్టుడే!"

"ఈ ప్రపంచంలో ఎందరో దుష్టులున్నారు. మీకు కావలసిన దుష్టుణ్ని మీరు పట్టుకోవాలిగానీ.." అని ఆగాడాయన.

"మీవాడే ఆశానాథని నా అనుమానం" అన్నాడు కిల్లర్.

శశికాంత్ తండ్రి తెల్లబోయి—"అందుకు ఋజువుందా?" అన్నాడు.

"కాదనడానికి ఋజువులేదు.."

శశికాంత్ తండ్రి వాదన మాని—తన కొడుకును వదిలిపెట్టమని బ్రతిమాలాడు.

కిల్లర్ లొంగలేదు.

"మావాడిని వదిలిపెడితే నేను మీకు ఆశానాథ్ ఆచూకీ చెప్పగలను—" అన్నాడు శశికాంత్ తండ్రి.

కిల్లర్ కళ్ళు మెరిశాయి—"చెప్పండి—"

"మీరు నన్ననుమానించకూడదు. నాపై నేరం మోపకూడదు. నా పేరు బయటకు రానివ్వకూడదు. నన్ను సాక్ష్యంగా ఉపయోగించుకోకూడదు.."

"షరతులు పెట్టాల్సింది నేను. మీరు కాదు.."

"నా కొడుకును రక్షించుకునేందుకు ఆశానాథ్ వివరాలు చెప్పడంలో నా షరతులు నాకుంటాయి. లేకుంటే నా ప్రాణాలకే ప్రమాదం..." అన్నాడు.

కిల్లర్ ఒప్పుకున్నాడు.

"సరిగ్గా గంట తర్వాత మీకు నేను ఫోన్ చేసి వివరాలు చెబుతాను. ఆ వివరాలు మీకు పనికివస్తే నా

కొడుకును వదిలిపెట్టండి—" అన్నాడాయన దీనంగా.

"సరే—" అన్నాడు కిల్లర్.

ఆయన వెళ్ళిపోయాడు.

సరిగ్గా గంట తర్వాత ఫోన్ వచ్చింది.

"నవరంగ్ లాడ్జి—రూం నంబరు డెబ్భైనాలుగులో ఆశానాథ్ వుంటున్నాడు—" అని చెప్పాడు శశికాంత్ తండ్రి.

7

ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, డిటెక్టివ్ కిల్లర్ నవరంగ్ లాడ్జికి వెళ్ళారు.

రిసెప్షనిస్టు వారికి నమస్కరించాడు.

"రూం నంబరు డెబ్భైనాలుగులో ఎవరుంటున్నారు?" అన్నాడు కుమారస్వామి.

రిసెప్షనిస్టు పుస్తకం తిరగేసి-"అతడి పేరు దీనానాథ్. ఇందులో చేరి నాలుగురోజులయింది. ఇంకా రెండురోజులుంటానని చెప్పాడు—" అన్నాడు.

"అతడిని కలుసుకోవాలి—" అన్నాడు కుమారస్వామి.

"బయటకు వెళ్ళి గంటయింది...."

"అయితే ఒకసారి అతడి గదిని సోదా చేయాలి...."

రిసెప్షనిస్టు తటపటాయించాడు. కుమారస్వామి అతణ్ణి పోలీసు పద్ధతిలో లాలించి బెదిరించాడు.

చివరకు రిసెప్షనిస్టు ఒప్పుకున్నాడు. తాళం తీసుకుని అతడూ వారితోడా వెళ్ళాడు.

గదిలో....

మంచంమీద ఒక బ్రీఫ్‌కేసుంది.

బ్రీఫ్‌కేసులో ఒక డైరీ — కత్తి — రివాల్వర్

వున్నాయి.

డైరీలో శ్రీనాథపురంలోని కొందరు ప్రముఖుల చిరునామాలున్నాయి.

అక్కడక్కడ అతడు దినచర్యకూడా రాసుకున్నాడు.

“ఈరోజు సదానంద్ నగలషాపులో — పదివేలు విలువ చేసే హారం కాజేశాను. దీంతో నామీద నాకు నమ్మకం పెరిగింది—” అని ఒకరోజుంది.

“రంగన్న పేటలో వేరుశెనక్కాయ లమ్మకునే ముసలమ్మ దగ్గర రెండు కేజీల హీరాయిన్ మూట దాచాను. అందుకు పదిరూపాయలిస్తే యెంతో సంబరపడింది. పార్టీ నుంచి డబ్బు రాగానే —ముసలమ్మనుంచి కలెక్టు చేసుకోమని చెప్పాలి-” అని ఇంకో రోజున వ్రాసి వుంది.

అన్నిటికంటే విచిత్రం డైరీమీద అశానాథ్, బి.ఏ.- అని స్పష్టంగా పేరు రాసి వుంది.

కుమారస్వామి, కిల్లర్ —గదంతా వెతికారు.

వేరే సూట్‌కేసొకటుంది.

అందులో ఖరీదైన కెమేరా ఒకటుంది. ఒక చిన్న లెదర్ బ్యాగుంది.

లెదర్ బ్యాగులో శ్రీనాథపురంలోని దారులన్నీ వివరంగా తెలియబర్చే పటం వుంది. అందులో కొన్ని ప్రాంతాల ఎర్ర సిరాతో ఇంటూ మార్కులున్నాయి.

“దగ్గర్లో జిరాక్స్ సెంటరేదైనా వుందా?” అన్నాడు కిల్లర్.

“మా లాడ్జిలోనే ఒ క టుం ది—” అన్నాడు రిసెప్షనిస్టు.

అవసరమైన డాక్యుమెంట్సన్నింటికీ క్షణాలమీద

ఫోటో కాపీలు తీయించాడు కుమారస్వామి.

"ఈ విషయం—ఇంకెవరికీ చెప్పొద్దు రహస్యంగా వుంచు. దీనానాథ్‌కి తన గురించి పోలీసులు వచ్చి వెళ్లారని తెలియకూడదు—" అన్నాడు కిల్లర్.

రిసెప్షనిస్టు తల ఊపాడు.

వెళ్ళేముందు కుమారస్వామి ఆగదిలో ఉన్న గాజు గ్లాసొకటి తీసుకున్నాడు జాగ్రత్తగా—

"వేలిముద్రలకోసం—" అన్నాడతడు కిల్లర్‌తో.

కిల్లర్ సాలోచనగా తలపంకించాడు.

రిసెప్షనిస్టుకు కృతజ్ఞతలు తెలుపుకొని ఇద్దరూ వెళ్ళిపోయారు. వాళ్ళు కనుమరుగయ్యేదాకా బయటకు వెళ్ళి చూసి—తర్వాత తన సీట్లో కూర్చున్నాడతడు.

అప్పుడతడి యెదురుగా ఓ వ్యక్తి ప్రత్యక్షమయ్యాడు.

అతణ్ణి చూసి రిసెప్షనిస్టు ఉలిక్కిపడి "దీనానాథ్!" అన్నాడు.

"అంతా గమనిస్తున్నాను నేను—" అన్నాడతడు.

అతడి కళ్ళలో నిప్పులు కురుస్తున్నాయి.

8

సదానంద్ షాపులో పదివేల విలువచేసే హారం పోయింది—కానీ ఆ రోజే తిరిగి వచ్చింది. ఎవడో కుర్రాడది తెచ్చి యజమానికి అందించాడు.

హారంతోపాటు ఓ ఉత్తరముంది.

"జరిగింది మరిచిపో-ఇది నకిలీ హారంకాదు. కేవలం వార్నింగ్ కోసం నేనిది పట్టుకుపోయాను...." అని ఉన్నదందులో.

కుమారస్వామి, కిల్లర్ ఆ ఉత్తరం సదానంద్ చూపించగా చూసి థ్రిల్లయ్యారు. డైరీలోని దస్తూరితో

సరిపోతోందది.

వారా ఉత్తరాన్నడిగి తీసుకున్నారు.

రంగన్న పేటలో వేరుశెనక్కాయలమ్ముకునే ముసలమ్మ ఉంది. ఆమె తనకు పదిరూపాయలిచ్చి ఒకడొక మాట దాచుకొన్నాడని చెప్పింది. కొన్ని గంటల క్రితమే మరో వ్యక్తి వచ్చి ఆ మూటనడిగి తీసుకున్నట్లు ఆమె చెప్పింది.

"చాలా చిత్రంగా వుంది—" అన్నాడు కిల్లర్.

"ఏమిటి చిత్రం?" అన్నాడు కుమారస్వామి.

"ఆశానాథ్ ఆచూకీ ఇంత సులభంగా తెలియడం!"

"పెద్ద పెద్ద నేరస్థులు చాలా చిన్న తప్పులు చేసి దొరికిపోతారు. నా అనుభవంలో ఇదేమీ చిత్రంకాదు" అన్నాడు కుమారస్వామి.

"అలాగనుకుంటే అది నీ భ్రమ—ఇందులో యేదో ట్రాప్ వుంది...."

"ఏమిటి ట్రాప్!"

"హైదరాబాదులోని ఒక ముత్యాల వర్తకుడికి—కేవలం తన కొడుకును రక్షించుకునేందుకు—ఆశానాథ్ వివరాలు బయట పెట్టే అవకాశముందంటే నాకిది నమ్మ తగ్గదిగా లేదు—" అన్నాడు కిల్లర్.

"స్వార్థం మనిషి చేత యెంతపనైనా చేయనిస్తుంది."

"ఆశానాథ్ నమ్మే స్వార్థపరులు—వారి ప్రాణాలు పోయినా అతడి వివరాలు బయటపెట్టని నమ్మకస్థులై వుంటారు. అందుకే ఎప్పటికీ అతడి ఆచూకీ తెలియడం లేదు. అలాంటిది శశికాంత్ కోసం అతడి తండ్రి ఆశానాథ్ వివరాలెలా బైటపెట్టాడు? ఆశానాథ్ తన వివరాలనంత సులభంగా ఎలా వదిలి పెట్టాడు?" అన్నాడు కిల్లర్.

"నువ్వు చెబుతూంటే నాకూ అనుమానం వస్తోంది. అసలు శశికాంత్ విషయం మరీ అంత ప్రమాదకరమైన దేమీ కాదు. అతడు చేసిన నేరానికి పడే శిక్ష కూడా పెద్దది కాదు. ఈవ్ టీజింగ్ నేరంగా — ఒకో సారి హెచ్చరిక చేసి పంపేయడం జరుగుతుంది—" అన్నాడు కుమారస్వామి.

"ఇందులో యేదో పెద్ద నాటకముంది. శశికాంత్ కారణంగానే మనకు క్లూలు దొరకాలి. అతణ్ణి సులభంగా విడిచిపెట్టకూడదు...." అన్నాడు కిల్లర్.

"అతణ్ణి వదలను. తండ్రినీ వదలను...." అన్నాడు కుమారస్వామి.

ఇద్దరూ స్టేషన్ కు వెళ్లారు.

తను కూర్చుని అసహనంగా అటూ యిటూ తిరుగుతున్న కిల్లర్ తో — "నువ్వూ కూర్చో!" అన్నాడు కుమారస్వామి.

"ఒకసారి అర్జంటుగా శశికాంత్ తో మాట్లాడాలి" అన్నాడు కిల్లర్.

కుమారస్వామి కాన్ స్టేబుల్ని పిలిచి—శశికాంత్ ని తీసుకొని రమ్మన్నాడు.

కాన్ స్టేబులు ఆశ్చర్యంగా—"ఆయన్ను వదిలిపెట్టేశాంగా...." అన్నాడు.

"వదిలిపెట్టేశారా? ఎవరు చెప్పారని!" అన్నాడు కుమారస్వామి. అతడి కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి.

"ఎమ్మెల్యే జనార్దనంగారు స్వయంగా ఫోన్ చేశారు. అప్పుడు మీ రాయన పక్కనే వున్నారు. ఆయన మీ చేత కూడా చెప్పించారు...."

"నా చేత నా— నేనాయన్ను కలుసుకోనిదే!"

"కానీ...." అని గుటకలు మింగాడు కానిస్టేబులు.

"ఫోన్లమీద ఖైదీలను విడుదలచేయడం ఎప్పట్నించి మొదలయింది మన స్టేషన్‌లో...." అన్నాడు కుమారస్వామి కోపంగా.

"సార్—ఆర్నెల్ల క్రితం...." అని ఆగాడు కానిస్టేబులు.

"ఊఁ చెప్పు.." అన్నాడు కుమారస్వామి కోపంగా.

"ఆర్నెల్ల క్రితం యేమయింది?" అన్నాడు కిల్లర్ కుతూహలంగా.

"ఎమ్మెల్యేగారు ఫోన్ చేసి చెబితే నేను నమ్మలేదు. స్వయంగా వచ్చి వాళ్ళు పట్టుకోవాలా—ఫోన్ చేస్తే చాలదా—నీ చుట్టూ తిరగడానికి నాకింక వేరే పనులుండ వనుకున్నావా — అంటూ అగ్గిమీద గుగ్గిలమయ్యా డాయన...."

"అంటే ఫోన్‌చేసి ఖైదీలను విడిచిపెట్టమనడం ఎమ్మెల్యేలకు మామూలన్నమాట...." అన్నాడు కిల్లర్.

"ఇది ప్రజారాజ్యం. వారు ప్రజాప్రతినిధులు. ఈ విషయం మనమెంత తక్కువ మాట్లాడితే అంత మంచిది" అన్నాడు కుమారస్వామి అయిష్టంగా.

"కానీ ఎమ్మెల్యేగారికి ఫోన్ చేసి ఆయనలా ఎందుకు చేశారో కనుక్కోవచ్చుగా—" అన్నాడు కిల్లర్.

"ఆయన ఒప్పుకోడు. తనకేం తెలియదంటాడు. వాళ్ళ చెప్పినట్లు చేయకపోతే మేము శంకరగిరిమాన్యాలు పట్టి పోతాం. వాళ్ళు చెప్పినట్లు చేస్తే పదిమందికీ సంజాయిషీ యిచ్చుకోవాల్సిన బాధ్యత మాదే!" అన్నాడు కుమారస్వామి.

"ఎవరైనా ఎమ్మెల్యే పేరుతో ఫోన్ చేస్తే?"

"వివరాలడగొద్దు. ఫోన్ చేసింది ఎమ్మెల్యేయే అన డానికి మా సాక్ష్యాలు మాకున్నాయి—' అన్నాడు కుమారస్వామి.

"అయితే అవి ఉపయోగించుకో...."

"అవి ఉపయోగించుకోలేనివి...."

"ఇంతకీ ఆశానాథ్ కేసులో నువ్వేం చేయదల్చు కున్నావు?"

"నువ్వే చెప్పు...."

"శశికాంత్ ని మళ్ళీ అరెస్టు చేయి!"

"మనకతడు దొరుకుతాడా?"

"ఎందుకు దరకదు? అతడి తండ్రి చిరునామా, ఫోన్ నంబరు మన దగ్గరున్నాయి. మనమతడికి టెలిగ్రాం కొట్టడంవల్లనే కదా యిక్కడకు వచ్చాడు.... మళ్ళీ...." అని కిల్లర్ యేదో అనబోతూండగా బల్లమీద ఫోన్ మ్రోగింది.

కుమారస్వామి ఫోన్ తీశాడు. ఫోన్లోని కబురు వింటూనే అతడి ముఖం వివర్ణమైంది. అతడు ఫోన్ పెట్టేసి—"అంతా మోసం!" అన్నాడు.

"ఏమిటది?"

"హైదరాబాదునుంచి ముత్యాల వ్యాపారి శివకాంత్ ఫోన్ చేశాడు. తనకు శశికాంత్ పేరుగల కొడుకున్నాట్ట గానీ అతడు నాలుగు రోజుల్నించి అక్కడే వున్నాట్ట. అరెస్టయిన శశికాంత్ తో తనకే సంబంధమూ లేదుట. మనమిచ్చిన టెలిగ్రాం పోస్టల్ డిపార్టుమెంటువారి గొప్పతనంవల్ల ఇప్పుడే అందిందట...."

కిల్లర్ సాలోచనగా—"అంటే టెలిగ్రాం చూసి

అతడు మనకు ఫోన్ చేశాడన్నమాట.... శశికాంత్ మనకు అబద్ధం చెబుతూండవచ్చు. లేదా మనం అరెస్టు చేసిన శశికాంత్ అబద్ధం చెప్పి వుండొచ్చు. ఏదియేమైనా శశికాంత్ తండ్రినంటూ మనని కలుసుకున్న వ్యక్తి అతడి తండ్రి కాడనడంలో సందేహం లేదు...." అన్నాడు.

"అంతా అయోమయంగా వుంది...." అన్నాడు కుమారస్వామి.

"ప్రస్తుతానికి మనం శశికాంత్ విషయం వదిలిపెట్టి ఆశానాథ్ విషయం ఆలోచించాలి.." అన్నాడు కిల్లర్.

"ఆశానాథ్ ఉనికికి ఆధారం శశికాంత్. శశికాంత్ గురించి మనకంతా తెలుసనుకున్నాం. ఏమీ తెలియదని తేలిపోయింది. ఇప్పుడేం చేయాలి?"

కిల్లర్ యేదో అనబోయాడు. మళ్ళీ ఫోన్ మ్రోగింది బల్లమీద.

కుమారస్వామి ఫోన్ తీశాడు. మళ్ళీ అతడి ముఖం వివర్ణమైంది. ఫోన్ పెట్టేసి — "నవరంగ్ లాడ్జి రిసెప్షనిస్టు ఫోన్ చేశాడు—" అన్నాడు.

"ఏమంటాడు?"

"దీనానాథ్ తిరిగి వచ్చేట్ట...."

"వెరీగుడ్—" అన్నాడు కిల్లర్.

"గుడ్ కాదు—వెరీబాడ్!" అన్నాడు కుమారస్వామి.

"ఎందుకని?"

"అతడు రిసెప్షనిస్టుని వాడలగొట్టేశాడు. కుటుంబాన్ని సర్వనాశనం చేస్తానన్నాడు. తక్షణం హోటలు ఖాళీ చేసి వెళ్ళిపోయాడు. పోతూ పోతూ ఒక ఉత్తరమిచ్చి మనకిమ్మన్నాడు...."

"అంటే అతడికి మనం వచ్చి వెళ్ళినట్లు తెలిసిందన్న మాట!"

"మనమిలా వెళ్ళగానే అలా వచ్చేట్ట....రిసెప్షనిస్టు బాగా బెదిరిపోయాడు. ఉత్తరం కలెక్టు చేసుకుందుకు మననే రమ్మన్నాడు.."

"ముందా ఉత్తరంలో యేముందో చూద్దాం పద-" అన్నాడు కిల్లర్.

ఇద్దరూ లాడ్జికి వెళ్ళారు.

వాళ్ళను చూస్తూనే రిసెప్షనిస్టు వణికిపోతూ—

"మీరే నన్ను రక్షించాలి—" అన్నాడు.

"ఉత్తరం యేదీ?" అనడిగాడు కిల్లర్.

అతడో కవరందించాడు.

నీలిరంగు కవరు. లోపల తెల్ల కాగితం. కాగితంమీద ముత్యాలకోవలాంటి అక్షరాలు....

"డియర్ ఇన్స్పెక్టర్! పులిమీసాలతో ఆడుకుంటున్నావు. ఇది నీకే కాదు—నువ్వు రక్షించాల్సిన నీ నగరానికే ప్రమాదం. నీకు సరిగ్గా వారం రోజులు టైమిస్తున్నాను. నా గురించి నీకు లభించిన ఆధారాలు సర్వనాశనం చేయి. లేదా అకానాథ్ విశ్వరూపం చూస్తావు నువ్వు. నేనీ ఊళ్ళోనే వున్నాననడానికి గుర్తుగా రోజు విడిచి రోజు ఒక ప్రాంతంలో బాంబు పేలుస్తాను. వారం రోజుల్లో ఆ కాగితాలను నువ్వు నాశనం చేయకపోతే—ఆ తర్వాతనుంచి రోజుకొక యింట్లో మానభంగం జరుగుతుంది. రోజుకొక బ్యాంకు దోపిడీ జరుగుతుంది. రోజుకో గొప్పవాడి గుట్టు బయటపడుతుంది. బాగా ఆలో

చించుకో.... ఇది నా హెచ్చరిక!"

ఈ తరంలో సంతకం లేదు.

"ఇది డైరీలోని దస్తూరీలా లేదు—" అన్నాడు కిల్లర్.

"నన్ను సవాలు చేస్తున్నాడు. అనుభవిస్తాడు—" అన్నాడు కుమారస్వామి.

కిల్లర్ ఆలోచనగా—"మనం బంధించిన శశికాంత్, అతడి తండ్రి—వీరిద్దరిలో ఒకరు తప్పక అకానాధ్ కావాలని నా అనుమానం—" అన్నాడు.

"కావచ్చు—" అన్నాడు కుమారస్వామి.

ఇద్దరూ రిసెప్షనిస్టుని పోలికల గురించి అడిగారు. అతడేం పట్టాన చెప్పలేదు. తనకు పూర్తి పోలీసు రక్షణ లభిస్తుందని ఆశ పెట్టి, లేకుంటే జైలుపాలు కావాలని బెదిరించి—కొన్ని పోలికలు రాబట్టారు వారు. అవి శశికాంత్ తండ్రికి సరిపోయాయి.

"ఇప్పుడేం చేస్తావు?" అన్నాడు కిల్లర్.

"శ్రీనాథపురంలోని ప్రజలందర్నీ పత్రికలద్వారా, రేడియోద్వారా హెచ్చరిస్తాను. అకానాధ్ వంటి స్మగ్లరు కిక్కడ స్థానంలేదు. ఇక్కడ అడుగుపెట్టినందుకు ఫలిత మతడనుభవించాలి—" అన్నాడు కుమారస్వామి.

కిల్లర్ ఆలోచనగా—"ఈ ఉత్తరం కూడా పత్రికల్లో వేయిస్తావా?" అన్నాడు.

"ఊఁ."

"నీ పనయ్యాక నాకీ ఉత్తరం ఇవ్వు—"

"ఎందుకు?"

"ఈ దస్తూరి నన్నాకర్షిస్తోంది...." అన్నాడు కిల్లర్.

9

ఆ రోజు ఆగస్టు ఎనిమిది.

శ్రీనాధపురంలో పెద్ద సంచలనం చెలరేగింది.

కుమారస్వామి ఆకానాధ్ వివరాలు, బెదిరింపు లేఖ స్థానిక దినపత్రికలోని మొదటి పేజీలో వచ్చేలా చేశాడు.

ఈ వార్త ప్రతివారి నోట్లోనూ నలుగుతోంది.

ఆ రోజు సాయంత్రం ఊరి పొలిమేరల్లో ఓ బాంబు పేలింది.

జననష్టం కలగలేదు కానీ ప్రజల్లో అది భయాన్నీ, ఉత్సుకతనూ పెంచింది.

రోజులు గడుస్తున్నాయి.

రోజు విడిచి రోజు శ్రీనాధపురంలో బాంబు పేలుతోంది. ఒక రోజున పార్కు ప్రాంతంలో. మరో రోజున బీచి పక్కన. ఇంకో రోజు బస్టాండుకు కాస్త దూరంగా.

ఆకానాధ్ అన్న ప్రకారం బాంబులు పేల్చాడు.

శ్రీనాధపురంలో ఆకానాధ్ వున్నాడన్న వార్త గుప్పుమని ఎందరో అక్కడకు చేరారు. వారిలో జర్నలిస్టులున్నారు. గూఢచారులున్నారు. రచయితలున్నారు. అడ్వెంచర్స్‌ను అభిమానించేవారున్నారు.

ఒక్కసారిగా శ్రీనాధపురం పేరు రాష్ట్రస్థాయి నుంచి, జాతీయ స్థాయికీ అక్కణ్నుంచి అంతర్జాతీయ స్థాయికీ తరలిపోయింది.

ఏ రోజున యే యింట్లో మానభంగం జరిగిపోతుందో యే రోజున యే గొప్పవాడి గుట్టు బయటపడుతుందో.... ఏ రోజున ఏ బ్యాంకు దోచబడుతుందోనని ప్రజలందరూ

హడిలి పోతున్నారు.

అన్ని తరగతుల ప్రజలూ ఆకాశనాథ్ పేరే కలవరిస్తున్నారు.

ఎందుకంటే ఆకాశనాథ్ కుమారస్వామికిచ్చిన గడువు తేదీ అయిపోయింది.

ఆగస్టు పదిహేను వచ్చేసింది.

ఇన్స్పెక్టర్ కుమారస్వామి ఒక్కడే కాదు—యావత్తు పోలీస్ డిపార్టుమెంటూ ఊరంతా వలపన్ని ప్రజలను భయపడవద్దని ధైర్యం చెబుతోంది. అయినా బాంబుల పేలడంవల్ల ప్రజల్లో భయం తగ్గలేదు.

దేశంలోని దేశీయస్థాయి ఉన్న ప్రతి పత్రికా "శ్రీనాథపురం రిపోర్టు—" అని ఒక శీర్షికను మొదటి పేజీలోనే వేయసాగాయి. పేపరు కొనేవాళ్ళందరూ ఆ వార్త కోసమే చూసేవారు.

ఆగస్టు పదిహేను గడిచిపోయింది.

పదహారు.... పదిహేడు.... పద్దెనిమిది....

వారం రోజులపాటు శ్రీనాథపురంలో ఏ విశేషమూ జరుగలేదు.

ఆ తర్వాత ఒకరోజున కుమారస్వామికో ఉత్తరం వచ్చింది. అందులో ముత్యాలకోవవంటి దస్తూరీ ఉంది. మొదటిసారిగా తాను అనుకున్నది సాధించలేకపోయానని ఆకాశనాథ్ ఒప్పుకుంటూ—శ్రీనాథపురం పోలీసులను అభినందించాడు.

ఆ ఉత్తరం పేపర్లో పడ్డాక క్రమంగా ప్రజలలో శ్రీనాథపురం ఆకర్షణ తగ్గిపోయింది. పత్రికలు శ్రీనాథపురాన్ని మరిచిపోసాగాయి.

10

"ఎవరున్నువ్వు....?" అన్నాడు శ్రీనాథపురం ఎమ్మెల్యే.

"నా పేరు కిల్లర్. నేనొక డిటెక్టివ్‌ను...."

"నాతో నీకేం పని?"

"స్మగ్లర్ ఆశానాథ్‌కీ మీకూ సంబంధమున్నట్లు నాకు అన్ని ఋజువులు లభించాయి—" అన్నాడు కిల్లర్.

ఎమ్మెల్యే అతడిమీద మండిపడ్డాడు.

"లాభంలేదు. నేను పోలీసు డిపార్టుమెంటు మనిషిని కాదు — మీరంటే భయపడడానికి...." అన్నాడు కిల్లర్.

"ఏమిటి నీ ఋజువులు?...." అన్నాడు ఎమ్మెల్యే చివరికి.

"ఆశానాథ్‌తో సంబంధమున్న వ్యక్తిని మీరు పోలీసుల నుంచి విడిపించారు—" అంటూ కిల్లర్ ఆ కథంతా చెప్పాడు.

ఎమ్మెల్యే తనకేమీ తెలియదని దబాయించాడు.

"జరిగింది యథాతథంగా పోలీసులకు తెలుసు. వారిది బైటపెట్టరు. కానీ సాక్ష్యాలు నా దగ్గర కూడా ఉన్నాయి. అవి పత్రికలో ప్రకటించి ఈ కథను వేస్తాను. అప్పుడు సంజాయిషీ మీరు ప్రజలకే యివ్వవలసి కోవాలి...."

ఎమ్మెల్యే కాస్త భయపడ్డాడు—"నీకు డబ్బు కావాలా?" అన్నాడు.

"కాదు....ఆశానాథ్ ఉనికి...."

ఎమ్మెల్యే అతణ్ని భ్రమలో పెట్టాలని విఫలుడై—

"అయితే అసలు సంగతి నీకు చెప్పక తప్పదు. నాకూ ఆశానాథ్‌కీ ఏ విధమైన సంబంధమూ లేదు. అయితే శశికాంత్ పేరుతో మీ చేత అరెస్టుకాబడ్డ వ్యక్తి నా మనిషి...." అన్నాడు.

"ఆ సంగతి నాకు తెలుసు..." అన్నాడు కిల్లర్ — "అసలు ఆశానాథ్ అన్నదే ఒక కల్పన. అతడే ఊరు వచ్చేడన్న భ్రమ కలిగించాలని మీ రనుకున్నారు. ఇందులో మీ హస్తముందని నాకు తెలుసు. కానీ మీరు సాధించదల్చుకున్న దేమిటో నాకు తెలియలేదు...."

"నీకు తెలిసిన ఆ విశేషాలను మాత్రం ఎలా ఊహించావు?" అన్నాడు ఎమ్మెల్యే.

కిల్లర్ నవ్వి— "ఆశానాథ్ వంటి స్మగ్లరు అజాగ్రత్తగా ఉండడు. అటువైన డైరీలో అతడు రాసుకున్న వివరాలు ముందుగా రాసి పెట్టుకున్నవి. అవి కేవలం పోలీసులను తప్పుదారి పట్టించడానికే ఉద్దేశించబడ్డాయి. ఒక హారం దొంగతనం. ఒక హీరాయిన్ మాటలో మమ్మల్నతడు నమ్మించాలనుకున్నాడు. కానీ అందులో ఉన్న యితర సమాచారాలన్నీ తప్పు.

అన్నింటికీ మించి ఆశానాథ్ కుమారస్వామికి వ్రాసిన లేఖ నన్ను బాగా అనుమానానికి గురిచేసింది. పోలీసులు వచ్చి తన గదిని శోధించి తన రహస్యాలు తెలుసుకుని వెళ్ళారని తెలిసేక యే మనిషీ ముత్యాలకోవ వంటి దస్తూరీలో లేఖను వ్రాయలేడు. అతడి దస్తూరీలో తడబాటు, కోపం, ఆవేశం వ్యక్తమవుతాయి. ఆ ఉత్తరాన్నతడు ముందుగానే వ్రాసుకొని ఉండాలి. ఆ వ్యక్తి నకిలీ ఆశానాథ్ అయినప్పటికీ—అతడి గదిలోని సాక్ష్యాల వల్ల అతడికేమీ ప్రమాదం లేకపోయినప్పటికీ—పోలీసు

వాళ్ళు వస్తారన్న కంగారువల్ల అప్పటికప్పు డతడా ఉత్తరాన్ని అంత అందంగా రాయలేదు. కాబట్టి ఇదివరకో ఆడుతున్న నాటకం. అది మీరే ననడానికి పాత్ర్యాలు మీకే తెలుసు. ఇదంతా యెందుకు చేశారో చెప్పక పోతే— నేనీ కథను బయటకు చెప్పక తప్పదు....” అన్నాడు.

“నేనీ ఊరి ఎమ్మెల్యేని. ఏ పార్టీకీ చెందని స్వతంత్రుణ్ని. అధికారపక్షం రెండు లక్షల రూపాయల ఆశ చూపించింది. ఇది చేశాను. ఇది బుజావు చేయలేని నేరం. నీ కుతూహలం తీర్చుకునేందుకు నిజం చెబుతాను. ఆ తర్వాత ఇది మర్చిపో. ఇందులో యే దుర్మార్గుడూ విడిచిపెట్టబడలేదు. సామాన్యుడు నష్టపోలేదు....” అని ఆగాడు ఎమ్మెల్యే.

“అవును. అసలిదంతా ఎందుకు?”

ఎమ్మెల్యే నవ్వి—“ఆగస్టు 15న ప్రతిపక్షాలు మనోహర రెడ్డి అధ్వర్యంతో పెద్ద సమావేశం జరిపారు. దాని గురించి యెన్నో చర్చలు వచ్చాయి. దేశ రాజకీయ చరిత్రనే అది మార్చివేస్తుందని చాలామంది అనుకున్నారు....” అన్నాడు.

“అవును. ఆ సమావేశం జరిగిందిగా....” అన్నాడు కిల్లర్.

“జరిగింది. కానీ ఆశానాథ్ ఊపులో దాన్ని పట్టించుకున్నవారెవ్వరు? అటు ప్రజలు, ఇటు పత్రికలు.... ఆశానాథ్ గురించే ఆలోచిస్తున్నారు. ప్రజల దృష్టిని పూర్తిగా ఆ మహాసభ నుంచి మళ్ళించడానికే ఈ ఆశానాథ్ కల్పన! ఆ మహాసభ అనామకంగా ముగిసింది.... ప్రతిపక్షాల ఎత్తుకి ఇదొక రాజకీయపు పై ఎత్తు....ఇందులో

నీ వంటివారు వేలు పెట్టకూడదు——....." అన్నాడు ఎమ్మెల్యే!

కిల్లర్ అక్రమణ్ణించి లేచాడు.

ఇది అతదూహించని విశేషం!

ఇప్పుడు తనేం చేయాలి?

నేరాన్ని దాచడం అతడి ప్రవృత్తి కాదు. కానీ ఈ నేరాన్ని ప్రజలముందుంచితే ఎవరు నమ్ముతారు? ఎవరు పట్టించుకుంటారు!

"ఒకసారి డిటెక్టివ్ వెంకన్నను కలుసుకుని సలహా అడగాలి!" అనుకున్నాడతడు. అతడేం సలహా ఇస్తాడో కిల్లర్‌కి తెలియదు గనుకనా!

——: అయిపోయింది :——